జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 26 | జులై | 2026 ◆ పేజీలు : 3

# వైద్యం వికటించి సర్పంచ్ మృతి..?

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 25 (ప్రజా జ్యోతి ):** పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామ సర్పంచ్ సోడే వెంకటరమణ మృతి శనివారం భద్రాచలంలో కలకలం రేపింది. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని మిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం, గతంలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న వెంకటరమణకు ఇటీవల మళ్లీ వాపు రావడంతో

మిగతా 2 లో...

# మావోయిస్టుల ఆయుధాల డంప్ స్వాధీనం

- పేలుడు పదార్థాలు, మోర్టార్ షెల్లు, తూటాలు స్వాధీనం





**చర్ల , జూలై 25 (ప్రజాజ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో నక్సల్ రహితంగా మారిన ప్రాంతాల్లో నక్సలైట్లు గతంలో దాచి పెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను వెలికితీసేందుకు సంయుక్త భద్రతా బలగాలు చేపడుతున్న సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని పదమెటా క్యాంపు నుంచి పదగుండా–కర్సేనార్ వైపు 44వ బెటాలియన్ ఐటిబిపి , జిల్లా పోలీసుల సంయుక్త బృందం విస్తృతంగా కూంబింగ్ నిర్వహించింది.ఈ సందర్భంగా పదమెటా క్యాంపుకు ఉత్తర దిశలో ఉన్న పదగుండా–కర్సేనార్ గ్రామాల అటవీ, కొండ ప్రాంతంలో నక్సలైట్లు దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాల డంప్‌ను భద్రతా బలగాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో ఒక 12 బోర్ రైఫిల్, 55 రౌండ్ల 12 బోర్ తూటాలు, నాలుగు 51 మి.మీ స్థానికంగా తయారు చేసిన మోర్టార్ షెల్లు, 25 ఇనుప ఈటెలు, ఒక బ్యాటరీ, ఒక స్టీల్ కంటైనర్, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జెండా ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న సామగ్రిని నిబంధనల

మిగతా 2 లో...





# డ్రైనేజీలపై... అక్రమ నిర్మాణాలు..!

2 లో..

- పంచాయతీ ఆదేశాలు బేఖాతరా..?
- నోటీసులు ఇచ్చినా మారని పంథా
- సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో వెలుగులోకి వచ్చిన అక్రమాల వ్యవహారం
- నెలలు గడుస్తున్నా తొలగించని నిర్మాణాలు
- అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారా అనే విమర్శలు
- చర్యలు తీసుకోకపోవడమే వారికి అలుసా!
- నోటీసులు ఇచ్చి నెలలు గడుస్తున్న తొలగించని నిర్మాణాలు
- ఉన్నతాధికారులు జర స్పందించరూ!

మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో డ్రైనేజీలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత వ్యక్తులు వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలను అలాగే కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చి నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి తొలగింపు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

# భద్రాచలంలో రూ.56 లక్షల విలువైన 101 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- వాహన తనిఖీల్లో ఎర్టిగా కారులో భారీగా గంజాయి స్వాధీనం
- కర్ణాటక, ఏపీకి చెందిన నలుగురు నిందితుల అరెస్ట్
- రూ.56 లక్షల విలువైన గంజాయి, కారు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్
- మారేడుమిల్లి నుంచి బెంగళూరుకు అక్రమ రవాణా చేస్తున్నట్లు

**ప్రాథమిక విచారణలో వెల్లడి**

**భద్రాచలం, జూలై 25 ప్రజాజ్యోతి:** భద్రాచలం పట్టణంలో ఎక్సైజ్ అధికారులు చేపట్టిన వాహన తనిఖీల్లో భారీగా ఎండు గంజాయిని పట్టుకున్నారు. కూనవరం రోడ్డులోని వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న కెఎ 03 ఎన్ఆర్ 5892 నంబరు గల ఎర్టిగా కారును ఆపి తనిఖీ చేయగా, అందులోని ఆరు బ్యాగుల్లో 101 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.ఈ ఘటనలో కర్ణాటకకు చెందిన సలీమ్ పాషా, హర్బజ్ హుస్సేన్, గుల్జార్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తికి చెందిన రాజేంద్ర ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి ప్రాంతంలో కిలోకు రూ.1,500 చొప్పున కొనుగోలు చేసిన గంజాయిని బెంగళూరులో కిలోకు రూ.8,000కు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి రూ.50.50 లక్షల విలువైన గంజాయి, రూ.5 లక్షల విలువైన

మిగతా 2 లో...

# భగీరథ పైపు లీకేజీతో బురదమయమైన రహదారి

- ట్రాక్టర్లతో వాహనాల తరలింపు.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్



**టేకులపల్లి,జూలై25,ప్రజా జ్యోతి:** టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా ప్రధాన రహదారి పూర్తిగా బురదమయం గా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందు లు కలిగిస్తోంది. రహదారిపై నీరు నిరంతరం ప్రవహించడంతో భారీ గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా నిత్యావసర సరుకులు తీసుకెళ్లే ట్రాలీలు, ఇతర వాహనాలు బురదలో చిక్కుకుపోతుండటం తో

మిగతా 2 లో...

## వైద్యం వికటించి సర్పంచ్ మృతి..?




(మొదటి పేజీ తరువాయి...)

మిమ్స్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్సలో భాగంగా మరోసారి ఆపరేషన్ చేయాలని చెప్పి అధిక మోతాదులో యాంటీబయోటిక్ ఇంజెక్షన్లు ఇవ్వడంతో ఆమె ఆరోగ్యం విషమించిందని ఆరోపించారు. అనంతరం హుటాహుటిన ఖమ్మంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ భార్య ప్రాణాలు కోల్పోయిందని, తమ ఇద్దరు చిన్నారులు తల్లిలేని వారయ్యారని మృతురాలి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని ఆసుపత్రి ఎదుట ఉంచి బంధువులు, గ్రామస్తులు, సీపీఐ నాయకులు అర్ధరాత్రి వరకు నిరసన చేపట్టారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అయినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బంధువులు, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.

### ♦ సమగ్ర విచారణకు స్థానికులు డిమాండ్..

ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మిమ్స్ ఆసుపత్రిలో గతంలో కూడా వైద్య సేవలపై పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అక్కడ పని చేస్తున్న వైద్యుల అర్హతలు, సేవల నాణ్యతపై ఉంటుందని కూడా సమగ్రంగా పరిశీలించి, తప్పులు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మావోయిస్టుల ఆయుధాల డంప్ స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రకారం జప్తు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలు నిరంతరం నిర్వహిస్తున్న ఆపరేషన్లు, స్థానిక ప్రజల సహకారంతో నక్సలైట్ కార్యకలాపాలపై సమర్థవంతమైన నియంత్రణ సాధించినప్పటికీ మావోయిస్టులు దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అలాగే ఏవైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు లేదా నక్సలైట్లకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని నారాయణపూర్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు అన్నారు.

## భగీరథ పైపు లీకేజీతో బురదమయమైన రహదారి



(మొదటి పేజీ తరువాయి...)

వాటిని ట్రాక్టర్ల సాయంతో బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్ సెంటర్‌లో ఈ పరిస్థితి కారణంగా ప్రయాణికులు, వ్యాపారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధి కారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీని శాశ్వతంగా మరమ్మతు చేయడంతో పాటు దెబ్బతిన్న రహదారిని పునరు ద్ధరించి ప్రజల ఇబ్బం దులను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## 101 కిలోల ఎండు గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

ఎర్టిగా కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.56 లక్షలుగా అధికారులు వెల్లడించారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం–1985 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ తనిఖీల ను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వి. సోమిరెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో భద్రాచలం ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించారు.



# డ్రైనేజీలపై... అక్రమ నిర్మాణాలు..!

- పంచాయతీ ఆదేశాలు బేఖాతరా..?
- నోటీసులు ఇచ్చినా మారని పంథా
- సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో వెలుగులోకి వచ్చిన అక్రమాల వ్యవహారం
- నెలలు గడుస్తున్నా తొలగించని నిర్మాణాలు
- అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారా అనే విమర్శలు
- చర్యలు తీసుకోకపోవడమే వారికి అలుసా!
- నోటీసులు ఇచ్చి నెలలు గడుస్తున్న తొలగించని నిర్మాణాలు
- ఉన్నతాధికారులు జర స్పందించరూ!

**మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత వ్యక్తులు వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలను అలాగే కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చి నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి తొలగింపు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.**

● ఇల్లందు, ప్రజాజ్యోతి

### ♦ యథేచ్ఛగా డ్రైనేజీలపై నిర్మాణాలు!

సుభాష్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ♦ నోటీసులు ఇచ్చినా మారని తీరు

సుభాష్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై గ్రామపంచాయతీ అధికారులు పలు మార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత వ్యక్తులు వాటిని పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది. దింతో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి వైఖరి ఏమిటనే ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు ముందస్తుగా నోటీసులు జారీచేసి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వారికి అలుసుగా మారిందనే ప్రచారం జరుగుతుంది.

### ● ఎవరు ఏమి చేయలేరనే ధీమా..?

డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాల విషయంపై సంబంధిత పంచాయతీ అధికారులు ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోరనే ధీమాతోనే కొందరు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకే నోటీసులు వచ్చినా నిర్మాణాలు యథాతథంగా కొనసాగుతున్నాయని అంటున్నారు.

### ♦ నెలలు గడిచినా తొలగింపులు శూన్యం

డ్రైనేజీలపై నిర్మాణాల విషయంలో గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసి నెలలు గడిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క నిర్మాణాన్ని కూడా తొలగించకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా అని సూటిగా ప్రశ్నిస్తున్నారు.

### ♦ అధికారుల ఆదేశాలకు విలువ లేదా..?

సుభాష్ నగర్ గ్రామపంచాయతీలో అధికారులు ఇచ్చిన ఆదేశాలను సైతం కొందరు పట్టించుకోకపోవడం అధికార యంత్రాంగం ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టిన వారు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటి అని ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి.

### ♦ చర్యలు తీసుకోకపోవడమే అలుసుగా మారిందా?

సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీలపై నిర్మాణాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే మరింత మంది ఆక్రమణలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

### ♦ ఇదెక్కడి తీరు అని ప్రశ్నిస్తున్న ప్రజలు

డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా ఎలాంటి చర్యలు లేకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా డ్రైనేజీలపై ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారి పట్ల ఉదాసీనతగా వివరించడంతో సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ♦ ఉన్నతాధికారులు జర స్పందించరూ!

డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నిర్మాణాలను వెంటనే తొలగించాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు. గ్రామపంచాయతీ నిబంధనలు ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తించేలా అధికారులు వ్యవహరించాలని, అక్రమ నిర్మాణాల విషయంలో ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఇలాంటి ఆక్రమణలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక పంచాయతీ, మండల, జిల్లా అధికారులు స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న సందిగ్ధత ప్రజల్లో నెలకొంది.

## ఆటో బోల్తా.. మహిళకు తీవ్ర గాయాలు

### ● 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందన.. ఇల్లందు ఏరియా ఆసుపత్రికి తరలింపు

**టేకులపల్లి,జూలై 25,ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం తోగూడెం నుంచి టేకులపల్లి మండల కేంద్రంలోని సంతకు కూరగాయలు తీసుకువస్తున్న ఆటో శనివారం ప్రమాదానికి గురైంది. టేకులపల్లి మండలం సాయన్నపేట మూలమలుపు వద్దకు రాగానే ఆటో టైరు అకస్మాత్తుగా పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో ఆటోలో నలుగురు ప్రయాణికులు ఉన్నారు. వీరిలో అజ్మీర పద్మ (40)కు నడుము భాగంతో పాటు పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే టేకులపల్లి 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించింది. అనంతరం ఈఎంటీ సునీత, పైలెట్ నాగేశ్వరరావు గాయపడిన వారిని సురక్షితంగా ఇల్లందు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు. అత్యవసర సమయంలో వేగంగా స్పందించి సేవలందించిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.



# ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోండి

- భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్





**చర్ల, జూలై 25 (ప్రజాజ్యోతి):** ఏజెన్సీ ప్రాంత ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకుని తమ న్యాయపరమైన సమస్యలకు చట్టబద్ధమైన పరిష్కారం పొందాలని భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ సూచించారు. ప్రతి శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేరుగా కోర్టుకు వచ్చి తమ సమస్యలను వివరించవచ్చని తెలిపారు. చర్ల మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం నిర్వహించిన ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల భద్రాచలం బార్ అసోసియేషన్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ ఆధ్వర్యంలో చర్ల మండలం లింగాపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు ఈ సందర్భంగా ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివనాయక్ మాట్లాడుతూ ఆర్థికంగా న్యాయవాదిని నియమించుకోలేని వారికి జిల్లా న్యాయ సేవల సంస్థ (లీగల్ సర్వీసెస్ అథారిటీ) ద్వారా పూర్తిగా ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. అర్హులైన వారికి ఉచితంగా న్యాయవాదిని నియమించి వారి తరఫున కోర్టులో ఎలాంటి ఫీజు లేకుండా వాదిస్తారని చెప్పారు.భారత న్యాయవ్యవస్థ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఓపెన్ కోర్ట్ వ్యవస్థ అని అన్నారు. కోర్టు పని వేళల్లో ఎవరైనా తమ సమస్యలతో నేరుగా కోర్టును సంప్రదించవచ్చన్నారు. ముఖ్యంగా ప్రతి శనివారం లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రీ-లిటిగేషన్ కేసులు, ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి పరిష్కారానికి అవసరమైన న్యాయ సలహాలు అందిస్తామని వివరించారు. పెన్షన్లు, భూ వివాదాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సమస్యలు ఎదుర్కొంటున్న వారు రాయడం రాకపోయినా నేరుగా వచ్చి తమ సమస్యలను వివరించవచ్చని సూచించారు.ప్రజలకు ఉపయోగపడేలా న్యాయ అవగాహన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడి చికిత్సకు రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఖర్చు అవసరమని తెలిసిన తర్వాత, తమ అధికార పరిధిలో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి కేసును రిఫర్ చేయగా వెంటనే స్పందించి వరంగల్ ఆసుపత్రికి పంపించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను న్యాయ సేవల సంస్థ దృష్టికి తీసుకొస్తే చట్టపరంగా తమకు ఉన్న అధికారాల మేరకు సాధ్యమైన సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం చర్ల మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజాసేవలో విశేష సేవలు అందిస్తున్న సీఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రామును శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, లింగాపురం సర్పంచ్ గుగులోతు మంగా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండారు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాస రావు, సీనియర్ న్యాయవాదులు రావి రాం మోహన్, పేరాల వెంకటేశ్వర్లు, అవులూరి సత్యనారాయణ, సాదనపల్లి సతీష్, రాజేంద్ర వర్దన్, శివ కృష్ణ, మహిళా న్యాయవాది ధాట్ల సంధ్య, వాసం శారద, సంధ్యారాణి, యూత్ నాయకులు బోరా పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తాలిపేరు నీటి మళ్లింపు సరికాదు

- భద్రాద్రి జిల్లాను ఎడారిగా మారుస్తున్నారు
- తెలంగాణ రైతు సంఘం



**చర్ల, జూలై 25:(ప్రజాజ్యోతి):** సీతారామ ప్రాజెక్టు, తాలిపేరు ప్రాజెక్టుల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ఆరోపించారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లా ప్రయోజనాలను కాపాడడంలో విఫలమై భద్రాద్రిని ఎడారిగా మారుస్తున్నారని విమర్శించారు.శనివారం చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ప్రధాన ఉప కాలువలను తెలంగాణ రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు పరిశీలించారు. అనంతరం మాట్లాడిన అన్నవరపు సత్యనారాయణ సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో సుమారు మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు.సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి కాకుండానే ఉప కాలువలు తవ్వకుండానే ప్రధాన కాలువ నుంచి సాగర్ కాలువకు నీటిని మళ్లించడం సమంజసం కాదన్నారు. అదేవిధంగా తాలిపేరు ప్రాజెక్టు పరిధిలోని దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని సుమారు 24,700 ఎకరాల ఆయకట్టుకు కేటాయించిన నీటిని గోదావరి ద్వారా సీతారామ ప్రధాన కాలువకు మళ్లించడం జిల్లా రైతాంగానికి తీవ్రమైన అన్యాయం అని పేర్కొన్నారు.ప్రస్తుతం తాలిపేరు ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు భూములు సాగునీరు లేక ఎడారిగా మారే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వేల క్యూసెక్కుల నీటిని ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం నీటి వనరులను ఇతర ప్రాంతాలకు మళ్లించడం ద్వారా రైతుల ఆశలను దెబ్బతీస్తోందని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని మార్చుకోవాలని లేకపోతే రైతాంగాన్ని సమీకరించి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. తాలిపేరు ప్రాజెక్టు ప్రధాన, ఉప కాలువలు పూడికతో నిండిపోవడంతో చివరి ఆయకట్టు భూములకు నీరు చేరడం లేదని యుద్ధప్రాతిపదికన కాలువల మరమ్మతులు పూడికతీత చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే సీతారామ ప్రాజెక్టు కాలువల పనులకు తగిన నిధులు విడుదల చేసి ప్రస్తుత సాగు సీజన్‌లోనే రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకుడు ఎలమంచి రవికుమార్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మొర్ల ఎర్రయ్య రెడ్డి హయాంలో నిర్మించిన తాలిపేరు ప్రాజెక్టు చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులకు జీవనాధారంగా నిలిచిందన్నారు. సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో చూడాలని జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు కొక్కిరపాటి పుల్లయ్య, సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు మొరంపొడి శ్రీనివాసరావు, ఎలమంచి శ్రీనివాసరావు, తెల్లం ధర్మయ్య, మచ్చా రామారావు, బందెల చంటి, శ్యామల వెంకటేశ్వర్లు, సమ్మక్క, షారోన్, పూనెం సత్తిబాబు, వరలక్ష్మి , సూరమ్మ, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ సర్వెంట్ నేషనల్ అవార్డు అందుకున్న పాస్టర్ శ్రీనివాస్ పాల్



**టేకులపల్లి, జూలై 25,ప్రజాజ్యోతి:** వరంగల్ మండి బజార్‌లోని సెంటినరీ ట్రినిటీ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్రైస్తవ హక్కుల రక్షణ సమితి రెండవ వార్షికోత్సవంలో టేకులపల్లి మండలం బోడు గ్రామానికి చెందిన ఇమ్మానుయేలు ప్రార్థన మందిర సేవకులు, మండల అధ్యక్షులు పాస్టర్ శ్రీనివాస్ పాల్‌కు వ్యవస్థాపకులు జన్ను యిర్మియా చేతుల మీదుగా క్రిస్టియన్ సర్వెంట్ నేషనల్ అవార్డు ప్రదానం చేశారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవలు, చర్చిల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, కొత్త కోయ గిరిజనులకు నిత్యావసర వస్తువుల పంపిణీలో ఆయన చేసిన సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో అయూబ్, బోడ డిన్న, జన్ను శిబారాణి రాణి తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి వేళ బొడ్రాయికి జలాభిషేకాలు

- గ్రామ శ్రేయస్సు, సకాలంలో వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు
- రూ.35 వేల విలువైన మెస్‌ను బహుకరించిన రామేశెట్టి వెంకటేశ్వరావు





**అన్నపురెడ్డిపల్లి, జూలై 25 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని రాజపురం గ్రామంలో గ్రామదేవతగా కొలిచే బొడ్రాయి (నాభిశిల) వద్ద తొలి ఏకాదశి సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని రైతులు, మహిళలు జలబిందెలతో బొడ్రాయికి జలాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రామాలయం అర్చకులు ముదువర్తి వెంకట నరసింహాచార్యులు, శివాలయం అర్చకులు గన్ శ్యామ్ పాండే ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రామేశెట్టి వెంకటేశ్వరావు బొడ్రాయి వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.35 వేల విలువైన మెస్‌ను బహుకరించారు. గ్రామ రక్షణకు ప్రతీకగా భావించే బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ మెస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రామేశెట్టి వెంకటేశ్వరావు సేవాభావాన్ని గ్రామ పెద్దలు, భక్తులు అభినందించారు. గ్రామ సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆదర్శనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కోదుమూరి సత్యం, రామాలయం కమిటీ సభ్యులు కిశోర్, కృష్ణార్జునరావు, సుధాకర్ రెడ్డి, గణపతి రెడ్డి, వెంకటరెడ్డి, బోధ కృష్ణారెడ్డి, మంగతాయారు, శ్రీదేవి, సత్యవాణి, సుహాసిని, దండి అప్పయ్య, రాములు, రామేశెట్టి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు కోసం చలో హైదరాబాద్ గోడపత్రిక ఆవిష్కరణ



**టేకులపల్లి,జూలై 25,ప్రజాజ్యోతి:** సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఆగస్టు 23న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను శనివారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (జీహెచ్ఎస్) నిర్వహించిన ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ కార్యక్రమంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 నుంచి నియమితులైన ఉద్యోగులకు అమలవుతున్న సీపీఎస్ విధానం వల్ల పదవీ విరమణ అనంతరం తగిన భద్రత లభించడం లేదని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.సీపీఎస్ బాధితుల సమస్యలపై టీఎస్‌సీప ీపీసఈయూ 2016 నుంచి నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తోందని, ఇటీవల భద్రాచలం నుంచి ప్రారంభమైన జనజాగరణ యాత్ర ద్వారా సీపీఎస్ ఉద్యోగులను కలిసి ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆగస్టు 23న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేష్, జంకిలాల్, రాజు, నాగునాయక్, పుల్సింగ్, రమణ, హాతీరామ్ తదితర సీపీఎస్ బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.